సోమవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 39.0°C | కనిష్ఠం : 24.0°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : బుధవారం సా : 6.34 గం..
సహార్ : గురువారం ఉ : 4.46 గం..

గిరి వికాసం..

రైతులకు వరంలా పథకం

- జిల్లాలో 262 మంది అన్నదాతలకు రూ.3.28కోట్లు
- ఉచితంగా బోరు, మోటారు, విద్యుత్ సౌకర్యాల ఏర్పాటు
- ఐదెకరాల్లోపున్న సన్న, చిన్నకారు రైతులకు లబ్ధి
- పథకంతో 691.98ఎకరాల భూమి సాగులోకి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 2 : గిరిజన రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'గిరి వికాస పథకం' వరంగా మారింది. మహబూబాబాద్ జిల్లాలోని సన్న, చిన్నకారు కర్షకులకు కలిసి ఐదెకరాల్లోపు ఉన్న 262 మంది రైతులకు లబ్ధి చేకూరుతోంది. గిరి వికాస పథకం ద్వారా బోరు, విద్యుత్, మోటారు ఉచితంగా అందించి.. వారిని ఆదుకుని, ఆర్థికంగా బలోపేతం చేయడమే ముఖ్యఉద్దేశం. జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుమారు 262 మంది రైతులకు రూ.3.28 కోట్లు ఖర్చు చేసి, 110 బోర్లు వేసి 691.98 ఎకరాల భూమిని సాగులోకి తీసుకువచ్చారు. ఆరు మండలాల్లో ఒక్కబోరు కూడా మంజూరు చేయలేదు. ఇంకా జిల్లాలో 71 మంది రైతులకు గాను బోరు, విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది.

త్వరలోనే వారికి మోటార్లు, విద్యుత్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని డీఆర్‌డీవో అధికారులు చెబుతున్నారు. ఒక్కొక్క బోరు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతోంది. కరెంట్‌కు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు, మోటారు రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు చేస్తూ మహబూబాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 110 మంది రైతులకు బోరు, విద్యుత్, మోటారు సౌకర్యం కల్పించారు.

ఎంపిక విధానం ఇలా..

గిరిజన రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం (రెవెన్యూ అటవీ హక్కుపత్రం) కలిగి ఉండాలి. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు కలిగి ఉండాలి. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది రైతులు సమూహంగా ఏర్పడి గ్రామపంచాయతీలో కానీ, మండల పరిషత్‌లో కానీ దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తులను మండలస్థాయి కమిటీ ద్వారా ఎంపీడీవో పరిశీలించి, వాటిని జిల్లా డీఆర్‌డీఏకు పంపించడం జరుగుతుంది. అక్కడి అధికారులు ఆ దరఖాస్తులను మళ్లీ పరిశీలించిన తర్వాత భూగర్భ జలాల అధికారికి (గ్రౌండ్‌వాటర్) దరఖాస్తుల్లో పొందుపరిచిన వివరాల ఆధారంగా సర్వే నిర్వహించి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించడం జరుగుతుంది.

భూగర్భ జలాల అధికారి సర్వే అనంతరం.. ఆయన ఇచ్చిన నివేదిక ప్రకారం.. బోరు వేయడం జరుగుతుంది. విజయవంతమైన బోరుకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తారు. విద్యుత్‌శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపిస్తారు. వారుఇచ్చిన నివేదిక ప్రకారం.. డీఆర్‌డీఏ అధికారులు గిరి వికాస్ పథకం ద్వారా నిధులు పంపిస్తారు. విద్యుత్ అధికారులు పనిపూర్తి చేసిన తర్వాత బోరుబావికి సర్వీస్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని, తదుపరి మోటారు ఏర్పాటు చేసినీరు పోయిస్తారు. దీంతో గిరిజన రైతుల వ్యవసాయ భూములనుసాగులోకి తీసుకువచ్చి, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఈ గిరివికాస పథకం ఎంతగానో ఉపయోగపడనుంది. దీనికనుబంధంగా ఉపాధిహామీ పథకంలో టేకు మొక్కల పెంపకం, పండ్ల తోటల పెంపకం, ఫారం పౌడ్ (నీటిగుంటలు) పనులకు వీరికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.


నెల్లికుదురు మండలం జామతండాలో రైతు గుగులోతు భాస్కర్ వ్యవసాయ భూమిలో వేసిన బోరు


కొత్తగూడ మండలం ఓటాయిలో బోజ్యు ఈర్య వ్యవసాయ భూమిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మండలాల వారీగా మంజూరు ఇలా...

మండలం	వేసిన బోర్లు	రైతులు మొత్తం	ఎకరాలు	ఖర్చు(రూ)
బయ్యారం	26	58	174.69	91.81
డోర్నకల్	02	05	10.93	5.1
గంగారం	08	17	53.22	21.77
గార్ల	04	10	25.63	12.07
గూడూరు	13	32	79.23	31.27
కేసముద్రం	07	14	43.75	22.82
కొత్తగూడ	25	60	144.32	77.24
కురవి	02	04	10.26	04.24
మహ-బాద్	01	03	5.45	2.51
మరిపెడ	11	31	71.83	32.52
నర్సింహులపేట	01	03	7.33	3.27
నెల్లికుదురు	10	25	65.35	23.07
మొత్తం	110	262	691.98	328.97

గిరి వికాస పథకంతో లబ్ధి పొందా..

మాలోతు నాన్యా, రైతు, గుర్రాలగుట్ట తండా, డోర్నకల్



గత సంవత్సరం గిరి వికాస పథకం ద్వారా తన వ్యవసాయ భూమిలో ప్రభుత్వం బోరు, విద్యుత్, మోటారును ఉచితంగా అందించింది. దీంతో తనకున్న రెండెకరాల్లో మిర్చి, పత్తి పంటలను సాగుచేశా. దీంతో ఆ పంటలకు ఎండకాలంలో సైతం నీరు సమృద్ధిగా అందింది. దీంతో దిగుబడి వచ్చి ఆర్థికంగా బలోపేతమై పంట సాగు కోసం తెచ్చిన అప్పులు తీర్చాను. ఇప్పుడు సంతోషంగా ఉన్నాను.

బోరు వేశారు.. విద్యుత్ మరిచారు..

బానోత్ శంకర్, కేవులాతండా, మహబూబాబాద్ మండలం



గిరి వికాస పథకం ద్వారా గత ఎనిమిది నెలల క్రితం డీఆర్‌డీఏ అధికారులు తన వ్యవసాయ భూమిలో బోరు వేశారు. నేటికి ఆ బోరుకు విద్యుత్ సౌకర్యం, మోటారు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు విద్యుత్ సౌకర్యంతో పాటు మోటారు ఏర్పాటు చేసి ఆదుకోవాలి.

బాధ్యతాయుతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి

- నిర్వహణ ప్రక్రియలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకం
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



పీవో, ఏపీవోల శిక్షణలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల్లో బాధ్యతాయుతంగావిధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం పీవో, ఏపీవోలకు ఎన్నికల నిబంధనలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ఓటింగ్ ప్రారంభంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాక్‌పోలింగ్ నిర్వహించే విధానంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంబంధిత పోలింగ్ అధికారులు ఫాం-22ను క్షుణ్ణంగా చదివి తప్పులు లేకుండా సరిచూసుకోవాలన్నారు. శిక్షణ పొందే అధికారులు సందేహాలు ఉంటే వారికి మరొకసారి అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఉపఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ డేవిడ్, మాస్టర్ ట్రైనర్లు రాము, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలను పక్కాగా నిర్వహించాలి


మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 2 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) పదో తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ సూచించారు. కలెక్టర్‌లోని తన చాంబర్‌లో మంగవారం ఓపెన్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుంచి మే 2 వరకు పదో తరగతి, ఇంటర్ ఓపెన్ థియరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రతీరోజు రెండు పేపర్‌లకు పరీక్ష ఉంటుందన్నారు. మహబూబాబాద్ పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్ జమాండ్లపల్లి, తొర్రూరు జడ్పీహెచ్‌ఎస్ కేంద్రాల్లో ఓపెన్ ఎస్సెస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అనంతారంలోని టీఎస్ మోడల్‌స్కూల్, మహబూబాబాద్ జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాల, తొర్రూరు ప్రభుత్వజూనియర్‌కళాశాల నందు ఇంటర్ ఓపెన్ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఇక ప్రాక్టికల్ పరీక్షలు టీఎస్ మోడల్‌స్కూల్ మానుకోటలో మే 3వ తేదీ నుంచి 10 వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఆర్టీసీ బస్సులను నడపాలని. పరీక్ష సమయాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్‌లు,ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించేది లేదన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో మానుకోట ఆర్డీవో అలివేలు, డీఈవో రామారావు, మురారి శంకర్‌రావు, మందుల శ్రీరాములు, తేజోన్న తరెడ్డి పాల్గొన్నారు.



తుక్కుగూడ సభకు తరలాలి..

- ఉమ్మడి జిల్లా నుంచి తరలింపు ఏర్పాట్లు చేస్తున్నాం..
- కాంగ్రెస్ మేనిఫెస్టోను రాహుల్‌గాంధీ విడుదల చేస్తారు..
- లోక్‌సభ ఎన్నికల్లో కడియం కావ్యను గెలిపించాలి..
- మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ

7లో..



నా నిజాయితే రాజకీయ ఉన్నతికి మూలం

- బీఆర్‌ఎస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు
- యశస్వినిరెడ్డి చేతిలో ఓడినా ఎర్రబెల్లికి సిగ్గు రాలేదు
- నాపై చేసిన ఆరోపణలను పల్లా నిరూపించాలి
- మీడియా సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

7లో..

తాగునీటి సరఫరాపై హెల్ప్‌డెస్క్

- సమస్య ఉంటే 98494 20800కు కాల్ చేయండి
- మానుకోట మునిసిపల్ కమిషనర్ రవీందర్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్2 : మానుకోట పట్టణ పరిధిలో వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకాలు ఏర్పడ్డ వాటిని త్వరితగతిని పరిష్కరించి యథావిధిగా నీటి సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకునేందుకు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి సమస్యల పరిష్కారం, నిరంతర పర్యవేక్షణ కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు ప్రత్యేకంగా సెల్ నెంబరు :98494 20800ను కేటాయించినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు తమ ఫిర్యాదులను పైన తెలిపినసెల్ నెంబరుకు ఫోన్ ద్వారా లేదా వాట్సాప్, మేసేజ్‌ల ద్వారాఅందజేయాలని సూచించారు. ప్రజలు గమనించి ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఉపాధి పనులకు వెళ్తూ.. గుండెపోటుతో కూలీ మృతి


సావిత్రమ్మ (ఫైల్)

నర్సింహులపేట, ఏప్రిల్ 2 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులకు వెళ్తూ మంగళవారం ఓ కూలీ గుండెపోటుతో మృతి చెందిన ఘటన మంగళవారం నర్సింహులపేట మండలకేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. నర్సింహులపేటకు చెందిన లెక్కల సావిత్రమ్మ (60) ఉపాధిహామీ పథకంలో భాగంగా ఇంద్రకీలాద్రి పర్వతం చుట్టు కందకాలు తీసే పనులకు తోటి కూలీలతో కలిసి వెళ్తోంది. ఈ క్రమంలో గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ సమీపానికి వెళ్లగా, వాంతులు చేసుకుని స్పృహతప్పి పడిపోయింది. దీంతో తోటి కూలీలు స్థానిక వైద్యుని వద్దకు తీసుకువెళ్లారు. గుండెపోటు వచ్చిందని, వెంటనే మెరుగైన వైద్యం అందించాలని వైద్యుడి సూచన మేరకు మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు సావిత్రమ్మకు భర్త వెంకట్‌రెడ్డి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్


జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్స్ కానిస్టేబుళ్లకు సిమ్‌కార్డులను అందజేస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 2 : ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం సైబర్ నేరాల నియంత్రణ కోసం పోలీస్‌స్టేషన్ వారీకి ప్రత్యేక ఫోన్ నెంబర్లను కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెరిగిపోతున్న టెక్నాలజీకి తగ్గట్లుగానే దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లాలో సైబర్ క్రైమ్ యూనిట్ క్షేత్రస్థాయిలో పనిచేస్తుందన్నారు. తద్వారా సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్‌శాఖ సైబర్ నేర బాధితులకు మెరుగైన సేవలందించడానికి సైబర్ వారియర్స్‌కి ఒక మొబైల్ ఫోన్‌తో పాటు సిమ్‌ను అందించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో జరిగే సైబర్ నేరాలను ఎక్కడికక్కడే నియంత్రించేందుకు పోలీస్ స్టేషన్ వారీగా సైబర్ కేసుల్లో పూర్తిస్థాయి ఆధారాలు సేకరించి నేరస్తులను గుర్తించడం, నేరగాళ్లకు శిక్ష పడేలా చేయడం, బాధితులకు న్యాయం చేయడం అనేది సైబర్ వారియర్స్ చాలెంజ్‌గా తీసుకోవాల న్నారు. పోలీస్‌శాఖలో నియమితులైన పూర్తిస్థాయిలో టెక్నాలజీపై పట్టున్న సిబ్బందిని సైబర్ నేరాల నియంత్రణకు ఉపయోగించి ప్రజలకు త్వరితగతిన సేవ లందేలా చూడాలన్నారు. సైబర్ వారియర్స్ ఆర్థిక నేరాలు, కంప్యూటర్ వైరస్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, సైబర్ సెక్యూరిటీ, ఛాలెంజస్, రిస్క్‌అండ్ మేనేజ్‌మెంట్, నేషనల్ సైబర్ సెక్యూరిటీ, పాలసీ యాక్ట్, కమ్యూనికేషన్ వ్యవస్థ, ఇంటర్నేట్ డేటా సెంటర్, నెట్‌వర్క్ వ్యవస్థ, నేషనల్ నాలెడ్జ్ నెట్‌వర్క్, ఇన్ఫర్మేషన్ ఆడిటింగ్ కంప్లైట్స్, ఐవోటీ, కిష్టమైన వెబ్ ఆప్షన్స్ సెక్యూరిటీ రిస్క్, మొబైల్ అప్లికేషన్, సెక్యూరిటీ, సోషల్ మీడియా ఇన్ ఈ గవర్నర్స్, ఇండెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం లాంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. జిల్లా పరిధిలోని 18 పోలీస్ స్టేషన్‌లలో 18 మందిని సైబర్ క్రైమ్ నేరాలను పరిష్కరించేందుకు కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య, సైబర్‌క్రైమ్ డీఎస్పీ శ్రీనివాస్, సైబర్‌క్రైమ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై కరుణాకర్, సైబర్ క్రైమ్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సైబర్ వారియర్స్ ఫోన్ నెంబర్లు...

పోలీస్‌స్టేషన్	సెల్ నెంబర్
కొత్తగూడ	87126 58034
కేసముద్రం	87126 58035
కురవి	87126 58036
మరిపెడ	87126 58037
గార్ల	87126 58038
దంతాలపల్లి	87126 58039
పెద్దవంగర	87126 58040
డోర్నకల్	87126 58041
సీరోల్	87126 58042
గూడూరు	87126 58043
నర్సింహులపేట	87126 58044
మహ-బాద్ (రూ)	87126 58045
నెల్లికుదురు	87126 58046
చిన్నగూడూరు	87126 58047
తొర్రూరు	87126 58048
బయ్యారం	87126 58049
గంగారం	87126 58050
మహ-బాద్(టౌన్)	87126 58051

పడిపోయిన మిర్చి ధర

- మానుకోట మార్కెట్‌లో క్వింటాకు రూ.2 వేలపైన తగ్గింపు


మహబూబాబాద్ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 2 : జిల్లాలో మిర్చి ధరలు రోజురోజుకు పడిపోతున్నాయి. మహబూబాబాద్ మార్కెట్‌లో ఒక్కసారిగా క్వింటాపై రూ.2 వేలకు పైగానే తగ్గింది. కేసముద్రం మార్కెట్‌లో మాత్రం గత వారంరోజులుగా ధరలు పడుతూ లేస్తున్నాయి. మంగళవారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో తేజరకం మిర్చి ధర గరిష్ఠంగా రూ.17520 పలుకగా, కనిష్ఠ ధర రూ.10825 పలికింది. సగటున రూ.15525 ధర పలికింది. అత్యధికంగా రూ.15 వేల నుంచి రూ.16 వేల ధరలకు మాత్రమే వ్యాపారులు ఖరీదులు చేశారు. కేసముద్రం మార్కెట్‌లో మంగళవారం గరిష్ఠ ధర రూ.17299 కాగా, కనిష్ఠ ధర రూ.7842గా పలికింది. సగుటన రూ.15021 ధర పలికింది. మహబూబాబాద్ మార్కెట్‌లో గత 28న మిర్చి గరిష్ఠ ధర రూ.19599 వరకు ఉంది. ఆ తర్వాత సెలవుల తర్వాత మార్కెట్ తెరిచిన అనంతరం మిర్చి క్వింటాపై రూ.2079ల వరకు తగ్గాయి. కేసముద్రం మార్కెట్‌లో గత వారంలో రూ.16221 వరకు ఉండగా, మళ్లీ 17299 వరకు పెరిగింది. వరంగల్ మార్కెట్‌లో రూ.18600 వరకు తేజరకం ఉండగా ఈ మార్కెట్లలో మాత్రం రూ.1000 వరకు తగ్గించి ఖరీదు చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో మిర్చికి ధరలు పడిపోవడంతో ఈ మార్కెట్లలో కూడ మిర్చికి ధరలు తగ్గాయి.

ముల్కలపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.8లక్షల నగదు పట్టివేత


ముల్కలపల్లి చెక్‌పోస్టు వద్ద రైతుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

డోర్నకల్, ఏప్రిల్ 2 : మండలంలోని ముల్కలపల్లి వద్ద జాతీయ రహదారి 365/ఏపై ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్ పోస్టు వద్ద మంగళవారం రూ.8లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. ఖమ్మం నుంచి మహబూబాబాద్ వైపు వెళ్తున్న రెండు ట్రాన్స్‌పోర్ట్ మినీ ట్రక్కులను చెక్‌పోస్టు వద్ద సిబ్బంది తనిఖీ చేయగా.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం అర్వపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బిలియానాయక్ తండాకు చెందిన మాలోతు సోరన్‌సింగ్ అనేవ్యక్తి నుంచి రూ.4.50లక్షలు, ములుగు జిల్లా జగ్గన్నపేట పరిధి ఆరేపల్లికి చెందిన కావటి రవి వద్ద నుంచి రూ.3.50లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నగదు తరలిస్తున్న వ్యక్తులను ప్రశ్నించగా తాము రైతులమని, తాము పండించిన మిర్చిని ఖమ్మం మార్కెట్‌లో విక్రయించుకుని నగదు తీసుకువెళ్తున్నట్లు చెప్పారు. అయితే రైతుల వద్ద ఎలాంటి రశీదులు, తక్‌పట్టీలు లేకపోవడంతో ప్రత్యక్ష సాక్షుల సమక్షంలో పంచనామ నిర్వహించి నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మిర్చి విక్రయించగా వచ్చిన నగదుకు సంబంధించిన ఆధారాలను కలెక్టర్ కార్యాలయంలో చూపించి నగదు తీసుకువెళ్లవచ్చని రైతులకు సూచించామని సీఐ ఉపేందర్‌రావు తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటా

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి


గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరిన పలువురు బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 2 : కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు అండగా ఉంటానని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు మంగళవారం ఎమ్మెల్యేతో పాటు పార్టీ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ చేరారు. సోమారం, హరిపిరాల, వెంకటాపురంగ్రామాల ఎంపీటీసీ మునిగేటి శోభాయాకయ్య, వల్లపు గోపమ్మ మల్లయ్య, జాటోతు రాజేందర్‌తో పాటు మాటేడు, గుర్తూర్, హరిపిరాల గ్రామాల మాజీ సర్పంచ్ వల్లపు శోభయాకయ్య, మోత్కూరి రవీంద్రచారి, మమతారెడ్డి, నాంచారిమడూరు గ్రామశాఖ అధ్యక్షుడు ఉపాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ లింగాల వెంకటనారాయణ గౌడ్‌లకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ హైదరాబాద్ గాంధీభవన్‌లో పార్టీ జెండాకప్పి, వారిని ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తపాత క్యాడర్ తేడాలేకుండా అందరూ కలసి కట్టుగా పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీ తీసుకురావాలని సూచించారు. తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మాజీ పీసీసీ సభ్యులు నిరంజన్ రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ మేకల కుమార్, టౌన్ అధ్యక్షుడు సోమరాజశేఖర్ పాల్గొన్నారు.

'స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి'

మరిపెడ, ఏప్రిల్ 2 : ప్రతీ ఒక్కరు తమఓటు హక్కును ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం మరిపెడ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన హాజరై, మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు. చైతన్యవంతులైన విద్యార్థులు తల్లితండ్రులకు, బంధువులకు, స్నేహితులకు, ఇంటి పరిసర కుటుంబాలకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వారికి వివరించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సైదులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కవిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డిగ్రీ విద్యార్థులకు అవగాహన కలిపిస్తున్న ఆర్డీవో నర్సింహారావు

వానర శోకం

చనిపోయిన కోతి కోసం ఎదురుచూపులు



కేసముద్రం, ఏప్రిల్ 2 : తోటి వానరం విద్యుత్‌షాక్‌తో మృతి చెందగా అక్కడే దీనంగా మరో వానరం కూర్చోవడం పలువురిని చలింపజేసింది. కేసముద్రం స్టేషన్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి మంగళవారం ఒక కోతి ఎక్కడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో తన సహచర కోతి అది తిరిగి వస్తుందేమోనని అక్కడే కొన్ని నిమిషాల పాటు కూర్చొని ఎదురుచూసింది. ఈ దృశ్యం అక్కడున్న వారిని చలింపజేసింది.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

హనుమకొండ టౌన్, ఏప్రిల్2: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన రామగిరి శ్రీనివాస్ (34) హనుమకొండ గోకుల్‌నగర్‌లో కిరాయి ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. హైదరాబాద్ వెళ్లేందుకు సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో బస్టాండ్‌కు వస్తున్న క్రమంలో జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంతో వచ్చి ఢీకొట్టగా శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నా నిజాయితే రాజకీయ ఉన్నతికి మూలం

● బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు.. ● మీడియా సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: నిజాయితీ, క్రమశిక్షణ, విలువలతో కూడిన జీవితమే తన రాజకీయ ఉన్నతికి మూలమని, మూడు దశాబ్దాలకుపైగా తన రాజకీయ జీవితంలో అవినీతి మచ్చలేకుండా ఉన్నానని అందువల్లే అన్ని వర్గాల వారు తనను విశ్వసిస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండలోని తన నివాసంలో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కావ్యతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన కాంగ్రెస్‌లో తమ చేరికకు గల కారణాలు, బీజేపీ పాలన తీరు, బీఆర్ఎస్ నేతలు తనపై చేస్తున్న విమర్శలు, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగా ఆరోపణలు తదితర అంశాలపై వివరణ ఇచ్చారు. వివిధ వర్గాల్లో తనపై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకుంటూ రాజీపడకుండా ముందుకు వెళుతున్నానన్నారు. తన రాజకీయ ఉన్నతి కోసం ఎవరికీ అన్యాయం చేయలేదని, ఒకరి అవకాశాలను కొట్టి తన స్వార్థానికి ఉపయోగించుకునే చరిత్ర తనది కాదన్నారు. తానెప్పుడూ పదవుల కోసం వెంపర్లాడలేదని.. 1994లో తొలిసారిగా ఎమ్మెల్యే అయిన తరువాత కేబినెట్‌లో చోటు దక్కే వరకు ఆ విషయమే తనకు తెలియదని, ఇక ఎంపీగా గెలిచిన అనంతరం 2016లో కేసీఆర్ తనను పిలిచి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారని గుర్తు చేశారు. 2024లో కాంగ్రెస్ పెద్దలు తనను పార్టీలోకి రావాలని కోరారని, బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన ఒక నాయకుడు కాంగ్రెస్‌లో చేరికకు రెండు నెలలుగా తిరుగుతున్నా పార్టీ చేర్చుకోవడం లేదని, కానీ అదే తనను పార్టీలోకి రావాలని కాంగ్రెస్ ఆహ్వానించిందన్నారు. దళితులు, ముస్లింలు, క్రైస్తవుల హక్కుల పరిరక్షణతోపాటు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ చేరానన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎందరో పార్టీని వీడారని, వారందరినీ విడిచి తనొక్కడి విషయంలో మాత్రం కొందరు బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, అది వారి అవివేకానికి నిదర్శనమన్నారు. తాను వారిలా సంస్కారం లేకుండా మాట్లాడలేనని, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్ కుమార్తె పోటీచేస్తే మూడో స్థానమే అని ఆయన అనడమే నిదర్శనమన్నారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న దయాకర్‌రావు తన మనవరాలి వయస్సున్న యశస్వినీరెడ్డి చేతిలో ఓడిపోయినా సిగ్గు రాలేదని, బలుపు, అహంకార మాటలు తగ్గలేదని వ్యాఖ్యానించారు. ఇక నిప్పు తొక్కిన కోతిలా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను భూకబ్జాలు, అక్రమాలకు పాల్పడినట్లు చెబుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. వాటిని నిరూపించాలని.. నిరూపిస్తే వాటిని ప్రభుత్వానికి అప్పగిస్తానని సవాల్ విసిరారు. లేదంటే జనగామ చౌరస్తాలో పల్లా రాజేశ్వర్ రెడ్డిని బట్టలూడదీసి నిలబెట్టడం ఖాయమన్నారు. కొందరైతే తనను పండబెట్టి తొక్కుతామంటూ రెచ్చిపోతున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు పండబెట్టి తొక్కి న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలన్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ దండోరా ముసుగు తీసి బీజేపీలో చేరాలని శ్రీహరి హితవు పలికారు. దళితులను హింసపెడుతూ, రిజర్వేషన్ల తొలగింపు కుట్రలు చేస్తున్న బీజేపీ పక్షాన ఆయన ఎలా చేరుతాడని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్ తీసుకువస్తే సరిపోతుందని, ఆ పని బీజేపీ పదేళ్లుగా ఎందుకు చేయడం లేదని మందకృష్ణ ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. తాను దళితజాతి పరిరక్షణకు కృషి చేస్తున్నానని, అంతేకానీ తన రాజకీయ స్వార్థం కోసం దళితవర్గాలనే కాదు.. ఏ వర్గాలకు అన్యాయం చేయలేదని పునరుద్ఘాటించారు. మందకృష్ణ విధానాల వల్లే ఎంఆర్‌పీఎస్ ముక్కలైందని ఆరోపించిన కడియం శ్రీహరి.. వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న తన బిడ్డ డాక్టర్ కావ్యను ఆశీర్వదించి గెలిపించాలని ప్రజలను కోరారు. తన వలే నిజాయితీగా ప్రజలకు సేవ చేస్తుందని తాను హామీ ఇస్తున్నానన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

నమ్మకాన్ని నిలబెడతా : కావ్య

కాంగ్రెస్ అధిష్ఠానం తనపై నమ్మకంతో లోక్‌సభ టికెట్ కేటాయించడంపై డాక్టరు కడియం కావ్య అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలియచేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, పార్టీ పటిష్ఠతకు నిజాయితీగా కృషి చేసి అటు పార్టీ.. ఇటు ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతానని తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ ఫీజుల గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 2: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీబీఏ ఇతర డిగ్రీ రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ ఫీజులు చెల్లించుకునేందుకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 4 వరకు పొడిగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహచారి, డాక్టర్ ఎం.తిరుమలదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రూ.50 అపరాధ రుసుంతో ఏప్రిల్ 16 వరకు విద్యార్థులు ఫీజులు చెల్లించుకునే అవకాశం ఉందని తెలిపారు. రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూమెంట్ విద్యార్థులందరూ ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. పరీక్షలు మేలో నిర్వహిస్తామని ప్రకటించారు.

రాజస్థాన్ కోట మోషన్ కాలేజ్‌లో ఉచిత బ్రిడ్జి కోర్సు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2: రాజస్థాన్ కోట్ మోషన్ ఐఐటీ, నీట్ కాలేజీలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఉచితంగా 35 రోజుల బ్రిడ్జి కోర్సును ఈనెల 5 నుంచి ప్రారంభిస్తున్నట్లు కళాశాల హనుమకొండ బ్రాంచి చైర్మన్ వద్దకొండ వేణుగోపాల్ గౌడ్ మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణలో ఐఐటీ, మెడికల్ కోర్సులకు బేసిక్స్ కెరీర్ గైడెన్స్‌ను ఐఐటీ, నీట్ ఫ్యాకల్టీ బోధిస్తారని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట నయీంనగర్‌లోని బ్రాంచిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత బ్రిడ్జి కోర్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నయీంనగర్ బ్రాంచిలో, 9703000850 ఫోన్‌నెంబర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

అనైతిక ప్రాక్టీస్‌పై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉక్కుపాదం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2: రాష్ట్ర చరిత్రలోనే మొదటి సారిగా 19మంది నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కేసులు నమోదు చేసింది. ఈ కేసుల ప్రకారం రూ.5లక్షల నగదు జరిమానాతోపాటు యేడాది జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా ఆయుర్వేదం, హోమియో, యూనాని విద్యను అభ్యసించి అల్లోపతి చికిత్స అందిస్తున్న ముగ్గురిపై కూడా ఆయుష్ విభాగానికి ఫిర్యాదు చేసింది. వరంగల్ నుంచి డాక్టర్ జి.సురేష్, రంగంపేట నుంచి డాక్టర్ బి.సాంబయ్య, శంభునిపేట నుంచి డాక్టర్ టి.సదానందంలపై ఆయుష్ విభాగానికి ఫిర్యాదు చేసింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర శాఖ చైర్మన్ డాక్టర్ మహేష్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ హనుమంతరావు ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

కాంట్రాక్టు వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2: కాకతీయ మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 2: పద్మాక్షీ పాలీక్లినిక్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ చౌరస్తాలోని తమ క్లీనిక్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకుడు రఘు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు రక్తపరీక్షలతోపాటు టీఎస్‌హెచ్, టీ-3, టీ-4, జీఆర్‌బీఎస్, లిప్పిడ్ ప్రొఫైల్, ఈసీజీ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వైద్యరంగంలో సుదీర్ఘ అనుభం కలిగిన ప్రముఖ ఎండోక్రనాలజిస్టు డాక్టర్ ఇ.లక్ష్మణ్‌కుమార్, ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ అనీల్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం, రక్త పరీక్షలను నిర్వహిస్తామన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధిగ్రస్తులు గతంలో వాడుతున్న మందుల చిట్టీలను, రిపోర్టులను వెంట తీసుకొని రావాలని రఘు సూచించారు. ఉచిత వైద్యశిబిరంలో పాల్గొనే వారు సెల్ 9955996166, 9133893360 నెంబర్‌లలో ముందస్తుగా కాల్‌చేసి తమ నెంబర్‌ను రిజిస్టర్ చేసుకోవచ్చునని ఆయన వెల్లడించారు.

క్రూ కంట్రోల్ తరలింపును నిలిపివేయాలి

● లేదంటే ఆమరణ దీక్ష చేపడతా ● మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 3: కాజీపేట రైల్వే జంక్షన్ క్రూ కంట్రోల్ నుంచి క్రూ లింకుల తరలింపు చర్యలను వెంటనే నిలిపివేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేకుంటే ఆమరణ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. తరలింపును బీజేపీ ఎందుకు అడ్డుకోవడం లేదని రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం హనుమకొండలోని ఓ కన్వెన్షన్ హాలులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మా ట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికార ఒప్పందాలవల్ల కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాజీపేట ప్రాంతంలో నగరంలో ఒక ముఖ్య భాగంగా ఉన్నా అభివృద్ధిలో వెనకంజలో ఉందన్నారు. ఇందుకు బీఆర్ఎస్, బీజేపీలే కారణమని దుయ్య బట్టారు. కోచ్ ఫ్యాక్టరీ తరలిందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన వ్యాగన్ పరిశ్రమ పనులు ఏమయ్యాయని ప్రశ్నిం చారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగునెలల్లో చూపించామని రాజేందర్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో పశ్చిమలో రూ.2కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి రూ.40లక్షల కోట్ల అభివృద్ధిగా చూపించారంటూ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను విమర్శించారు. పదేళ్లలో పశ్చిమ అభివృద్ధిని విస్మరించి ప్రజలను మాయ మాటలు చెప్పి నమ్మించారన్నారు. వరంగల్ పశ్చిమలో వరదలతో ముంపు సమస్య తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపడుతున్నట్లు రాజేందర్‌రెడ్డి చెప్పారు. ఇందులో భాగం గా నయీంనగర్ బ్రిడ్జి, విస్తరణ చేపట్టినట్లు చెప్పారు. ఈనెల 5వతేదీన నయీంనగర్ బ్రిడ్జిని కూలగొట్టి కొత్తగా విస్తరణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రెండు నెలల్లో బ్రిడ్జి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. పెద్దపెండ్యాల జంక్షన్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల వాహనాలు వంతెన పై నుంచి రాకపోకలు సాగించవచ్చన్నారు. రెండు నెలల్లో హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి అవుతుందన్నారు. ఇక భద్రకాళి మాడ వీధుల నిర్మాణం చర్యలు కూడా అమల్లో ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ నేతల పాపాలే వారిని వెంటాడుతున్నాయని రాజేందర్‌రెడ్డి దుయ్యబట్టారు. లిక్కర్ కేసు, ఫోన్ ట్యాపింగ్, భూకబ్జాలు ఇలా అనేక అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. కేసీఆర్ కుటుంబ అక్రమాలు మరిన్ని వెలుగులోకి వస్తాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో దోపిడీ చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగునెలలు కాకముందే కేసీఆర్ కరువుయాత్ర పేరుతో విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. వర్షాకాలమే రాలేదు కరువు ఎక్కడిదని ప్రశ్నించారు. పశ్చిమలో ధరణి పేరిట భూ దందాలు, కబ్జాలు, అనేక అక్రమాలను ప్రజలే బయటపెడుతున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరుపనున్నట్లు రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ధరణి పేరిట భూముల స్వాహాతో పాటు బాలసముద్రంలో అక్రమంగా నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయంపై విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా, పీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, గుంటి కుమారస్వామితో పాటు బీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, మామిండ్ల రాజు, మానస రాంప్రసాద్, సయ్యద్ విజయశ్రీ రజాలీతో పాటు చీకటి ఆనంద్, నాయిని లక్ష్మారెడ్డి, డాక్టరు శ్రవణ్, బంక సంపత్ యాదవ్, కార్తీక్ తదితర నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 2: హనుమకొండలోని ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో ఏళ్ల తరబడి ఇక్కడే విధులు నిర్వహిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులను బదిలీచేసి వారిపై చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు అజ్మీరా వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్ మాట్లాడారు. ఇంజనీరింగ్ శాఖ లో కొన్నేళ్లుగా కొందరు అధికారులు విధులు నిర్వహించడంలో ఆంతర్యమేమిటన్నారు. ఇక్కడే పాతుకుపోయిన అధికారులను వెంటనే బదిలీ చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్ నాయక్, బాదావత్ భాస్కర్ నాయక్, నూనావత్ శ్రీనివాస్ నాయక్, జాటోతు బావుసింగ్, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

బెల్టు షాపులపై దాడి

వరంగల్ క్రైం, ఏప్రిల్ 2: టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరంగల్ నగరంలోని పలుచోట్ల బెల్టుషాపులపై దాడులు చేశారు. మంగళవారం నిర్వహించిన దాడిలో రూ.22వేల విలువ కలిగిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దేశాయిపేటలో రూ.8490, వడ్డెపల్లి రెండు ఇళ్లల్లో ఒకరి ఇంట్లో రూ.7300, మరొకరిఇంట్లో రూ.6420 విలువ కలిగిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూధన్ ధ్రువీకరించారు.

'రూ.2వేల నోట్లు మార్చుకోవచ్చు'

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 2: ప్రభుత్వం రూ.2వేల నోట్లను రద్దు చేసి, గత సంవత్సరం అక్టోబరు వరకు మార్చుకునే అవకాశాన్ని కల్పించిందని, ఇంకా ఎవరివద్దనైనా రూ.2నోట్లు ఉంటే రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం హైదరాబాద్‌లో మార్చుకోవచ్చని జిల్లా లీడ్ బ్యాంకు అధికారి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.20వేల వరకు మార్చుకొనే అవకాశం ఉందని, రీజినల్ కార్యాలయంలో నోట్లు మార్చుకునే వారు తమ బ్యాంకు అకౌంట్ వివరాలతో నోట్లను రీజినల్ కార్యాలయంలో అందించిన తర్వాత వారి ఖాతాలో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. పోస్టాఫీసుల్లో కూడా తమ బ్యాంకు అకౌంట్ పూర్తి వివరాలు, పోస్టాఫీసులో పూర్తి వివరాలతో నోట్లను అందజేస్తే మార్పిడి అనంతరం వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. రూ. 20వేలకు మించి ఉంటే కేవైసీ సర్టిఫికెట్‌తో ఇతర వివరాలను రీజినల్ బ్యాంకు కార్యాలయంలో అందించాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా రిజర్వు బ్యాంకుకు చెందిన 18 సెంటర్లు ఉన్నాయని ఏ సెంటర్‌లోనైనా మార్చుకునే అవకాశాన్ని ఆర్‌బీఐ కల్పించిందని అన్నారు.

కమిషనరేట్‌లో సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్

ప్రారంభించిన సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఏప్రిల్ 2: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. నేరాల నియంత్రణలో భాగంగా రాష్ట్ర సైబర్ క్రైం సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆరు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వరంగల్‌లో ఒక స్టేషన్ ప్రారంభించారు. స్టేషన్‌ను ప్రారంభించిన అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్‌క్రైం స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ సూచించారు. సైబర్ నేరానికి గురైన బాధితులు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో సైబర్ వారియర్స్‌గా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి కమిషనర్ చేతుల మీదుగా సెల్‌ఫోన్‌లు, సిమ్ కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రవిందర్, అబ్దుల్ బారీ, ట్రెయినీ ఐపీఎస్‌లు అంకిత్, శుభంనాగ్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఏసీపీ విజయ్‌కుమార్, సీఐ రవి తదితరులు పాల్గొన్నారు.


స్టేషన్‌ను ప్రారంభిస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్యలే..

బల్దియా కాంట్రాక్టర్ల నిరసన

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 2: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో రెండేళ్లుగా చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని, ఇదే విధంగా బిల్లుల విషయంలో జాప్యం చేస్తే ఆత్మహత్యలు తప్పవని బల్దియా కాంట్రాక్టర్లు అధికారులను హెచ్చరించారు. జీడబ్ల్యుఎంసీ కాంటార్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజారావు, ఎమ్డీ అదిల్ అమ్మద్ సంయుక్తంగా మాట్లాడారు. బల్దియాలో ప్రస్తుతం పైరవీకార్లకు, పర్సంటేజ్‌కార్లకే చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తున్నారని, తమ లాంటి వాళ్లకు బిల్లులు చెల్లించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని అన్నారు. జనరల్ ఫండ్స్ బిల్స్ ఇప్పటివరకే తమకు రూ.20కోట్ల వరకు రావాలని 2024లో వివిధ రకాల పన్నులు వసూలు చేసిన రూ.76 కోట్లు ఏం చేశారని వారు ప్రశ్నించారు. సీఎంఏ బిల్లులు కూడా చాలారోజులుగా పెండింగ్‌లో ఉన్నాయని ఇదేవిధంగా జరిగితే తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంటుందన్నారు. చాలామంది కాంట్రాక్టర్లు అప్పులు చేసి బల్దియా అభివృద్ధి పనులు చేశామని, రోస్టర్ విధానం కాకుండా బడా కాంట్రాక్టర్లకు కొందరు అధికారులు అడ్డదారిలో బిల్లులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. తమకే వచ్చే బిల్లులు తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు, తిరుపతి, దేవేందర్, రాజేంద్రప్రసాద్, బొక్క కుమారస్వామి, రవి, నాగరాజు, అప్పాల శ్రీనివాస్‌లతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.


నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

ఆటిజమ్‌పై అవగాహన పెంచుకోవాలి

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2: ఆటిజమ్ ఏ విధంగా వచ్చిందో అనేది కాకుండా.. ఎలా జయించాలో తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సూచించారు. అంతర్జాతీయ ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని మంగళవారం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లోని డైక్ కేంద్రంలో వరంగల్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పీడియాట్రిక్స్, ఎంజీఎం ఆధ్వర్యంలో ఆటిజమ్ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ.. పీడియాట్రిక్ విభాగంలో అనేక వసతులు ఉన్నాయని, వాటిని ఉపయోగిం చుకొని పిల్లల ఎదుగుదల పట్ల శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ వాసుదేవ్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శేషమాధవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

తుక్కుగూడ సభకు తరలాలి..

● ఉమ్మడి జిల్లా నుంచి తరలింపు ఏర్పాట్లు చేస్తున్నాం ● మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 2: ఈ నెల 6న హైదరాబాద్ తుక్కుగూడలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొనే కాంగ్రెస్ సభకు భారీగా తరలి.. విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం హనుమకొండలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తుక్కుగూడ సభ విజయవంతానికి తగిన ప్రణాళికలు రూపొందించామని, ఉమ్మడి జిల్లాలోని ప్రతీ గ్రామం నుంచి శ్రేణుల తరలింపునకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ముఖ్య నేతల తరలింపు ఏర్పాట్లను సమీక్షించి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సభలో అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొని లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తారని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆరు గ్యారంటీలను ప్రకటించారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్యారంటీలను అమలు చేసి ప్రజాదరణ పొందుతున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టో కూడా ప్రజా సంక్షేమం, అభివృద్ధికి దిక్సూచిగా ఉండనుందన్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో బలమైన విశ్వాసం నెలకొంటుండగా బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేక అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సురేఖ ధ్వజమెత్తారు. వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ కావ్యకు పార్టీ శ్రేణులు అండగా నిలిచి భారీ మెజారిటీతో ఆమెను గెలిపించాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరడం ఆనందంగా ఉందన్నారు.

కాంగ్రెస్ పటిష్ఠానికి కృషి చేస్తా : కడియం

కాంగ్రెస్‌లో చేరాక తొలిసారిగా డీసీసీ భవన్‌కు వచ్చిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠానికి అంకితభావంతో కృషి చేస్తానన్నారు. పార్టీ ఇచ్చిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి.. కడియం శ్రీహరిని సన్మానించారు. మీడియా సమావేశంలో వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణతో పాటు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో శ్రీహరిని సత్కరిస్తున్న నాయిని, చిత్రంలో మంత్రి కొండా సురేఖ, తదితర నాయకులు

తుక్కుగూడ, లోకసభ ఎన్నికపై సమీక్ష

మీడియా సమావేశం అనంతరం మంత్రి కొండా సురేఖ, వరంగల్ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితర నేతలు డీసీసీ భవన్‌లో సమీక్ష జరిపారు. తుక్కుగూడ సభకు వాహనాల సమకూర్పు, నియోజకవర్గాల వారీగా శ్రేణుల తరలింపు, నాయకులు బాధ్యతల విభజన తదితర అంశాలతో పాటు వరంగల్ లోక్‌సభ ఎన్నిక అంశాలను చర్చించినట్లు తెలిసింది.

అన్నదాతను అన్నివిధాలా ఆదుకోండి

● ఎంపీ మాలోతు కవిత

మహబూబాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నీటి నిర్వహణ, విద్యుత్ వైఫల్యం వల్లే రాష్ట్రంలో పంట నష్టాలకు కారణమని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు, బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాలోతు కవిత అన్నారు. ప్రస్తుత విపత్కార పరిస్థితుల్లో అన్నదాతను అన్ని విధాలుగా ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాలో ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు నష్ట పరిహారం, పంటలకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ఆదేశాలతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం కరువు నివారించే ప్రయత్నాలేవి చేయడం లేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో ఎకరా కూడా ఎండలేదని పేర్కొన్న ఆమె కాంగ్రెస్ వచ్చాకే పంటలు ఎండుతున్నాయని చెప్పారు. కల్లిబొల్లి మాటలు కట్టిబెట్టి వెంటనే రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇవ్వాలని అన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మహబూబాబాద్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, డీఎస్.రెడ్యానాయక్, హరిప్రియనాయక్, మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మర్రి రంగారావు, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, బానోత్ రవికుమార్, ఎండి.ఫరీద్, నజీర్‌అహ్మద్, ఊకంటి యాకూబ్‌రెడ్డి, మందుల రఘు, జాటోతు హరినాయక్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కవిత, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు

మోదీ సర్కార్ గుప్పిట్లో రాజ్యాంగ సంస్థలు

● న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాదినేని వెంకటేశ్వరరావు

బయ్యారం, ఏప్రిల్ 2 : ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ రాజ్యాంగ సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని.. ప్రతిపక్ష రాజకీయ పార్టీలను, ప్రత్యర్థులను, ఇతర ప్రజాసంఘాలను, కవులు, కళాకారులు, మేధావులను అణచివేతకు, నిర్బంధానికి గురి చేస్తుందని సీపీఐ (ఎంఎల్)-న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు సాదినేని వెంకటేశ్వరరావు, చిటిపాటి వెంకటేశ్వర్లు ఆరోపించారు. బయ్యారంలో మంగళవారం ఆ పార్టీ జిల్లా స్థాయి ముఖ్యకార్యకర్తల సదస్సు జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో విభిన్నమతాలు, జాతులు, తెగలకు చెందిన ప్రజానీకాన్ని బ్రాహ్మణీయ-హిందూత్వ ఫాసిస్టు సిద్ధాంతం ఆధారంగా చీల్చి, దేశ ప్రజల మధ్య ఆరని చిచ్చు రగుల్చుతున్నదని విమర్శించారు. ఓ పక్క కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ మరోపక్క దేశ ప్రజానీకాన్ని కాషాయీకరించే ప్రయత్నాలలో భాగంగా దేశచరిత్రను తిరగరాసే దుర్మార్గానికి దిగుతున్నదని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన దేశ ప్రజలు దారిద్ర్య దుర్భర పరిస్థితులలో కొట్టాడుతుంటే.. మతోన్మాదంతో జనాలను రెచ్చగొట్టి మరోసారి అధికారంలోకి రావాలని కలలు గంటున్నదని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా పార్లమెంట్ ఎన్నికల్లో న్యూడెమోక్రసీ రెండువర్గాలు కలిసి పనిచేయనున్నట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చిన వారు రెండు పార్టీల నాయకులు కలిసి ప్రచార క్యాంపెన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సదస్సులో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య రాష్ట్ర, జిల్లా నాయకులు జడ సత్యనారాయణ, శివ్వారపు శ్రీధర్, ఇడంపాక శ్రీశైలం, మండల నాయకులు పద్మ, పొమ్మయ్య, నాగేశ్వరరావు, వీరభద్రం, రాకేశ్, బిక్షం, చైతన్య, మధు, సమ్మక్క, యుగేందర్, యాదగిని, లింగన్న, అంజయ్య, సోమిరెడ్డి, బట్టు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర రావు

శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో విగ్రహావిష్కరణ పూజలు ప్రారంభం

గూడూరు, ఏప్రిల్ 2 : మండలంలోని మదనాపురం గ్రామశివారులో రూ.1.20 కోట్లతో నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహావిష్కరణ పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్, ఎల్ఎస్ఆర్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులు తన సొంతూరును ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రూ.1.20 కోట్లతో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, గోశాల, గ్రామదేవతల దేవాలయాలు, ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించిన విషయం విదితమే. నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈనెల 4 వరకు లక్ష్మీగోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి నూతన దేవాలయ విమాన గోపుర ధ్వజ శిఖర ప్రతిష్ఠ మహోత్సవ పూజలు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమానికి శ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామనుజ జీయర్ స్వామి దివ్య మంగళ శాసనములతో పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. మంగళవారం రోజున శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, సభాప్రార్థన, విశ్వక్సేనారాధన, పుణ్యవచనం, రక్షక బంధనం, ఋత్విక్‌వరణం, మృత్సంగ్రహణం తదితర కార్యక్రమాలను శ్రీమాన్ ముడుంబై లక్ష్మీనారాయణచార్యులు, శ్రీమాన్ కృష్ణచైతన్యచార్యులు, అర్చకులు గొడవర్తి శ్రావణ్‌కుమార్‌చార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. భక్తులు పూజాతంతును వీక్షించారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న లింగాల సుధీర్‌రెడ్డి దంపతులు

'ప్రవిత్రతకు ప్రతీక రంజాన్ నెల'

మరిపెడ, ఏప్రిల్2 : ప్రవిత్రతకు ప్రతీక రంజాన్ నెల అని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మంగళవారం రాత్రి మరిపెడ మసీదులో ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులకు ఆయన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అంతకు ముందు ముస్లింలతో కలిసి నమాజ్ చేశారు. ఈ సందర్భంగా రాంచంద్రునాయక్ మాట్లాడుతూ ముస్లిం సోదరుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నారన్నారు. మతపెద్ద మౌలాన, కాంగ్రెస్ మైనారిటీ నేతలు తాజుద్దీన్, అఫ్జల్, అఫ్సర్, షాజీవాన్‌ఖాన్ పాల్గొన్నారు.



మరిపెడ మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

జిల్లాలో 9మందికి పోలీస్ సేవా పతకాలు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 2 : జిల్లాలో నూతన సంవత్సరం 01-01-2023 నుంచి తెలంగాణ ఫార్మేషన్ డే 02-06-2023ను పురస్కరించుకుని తెలంగాణ పోలీస్‌శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి సేవా పతకాలు అందించడం జరిగిందని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకేన్ తెలిపారు. జిల్లాలో తొమ్మిది మంది పోలీస్ అధికారులకు పోలీస్ సేవా పతకాలకు ఎంపిక కాగా, అందులో అతిఉత్క్రిష్ట్ సేవ పతకం ఒకరు, ఉత్క్రిష్ట్ సేవ పతకంకు మరోకరు ఎంపికైనట్లు చెప్పారు. మహబూబాబాద్ ఏఆర్‌కు చెందిన ఏఆర్ ఎస్సై దామోదరాచారి, తొర్రూరు పీఎస్ నుంచి ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి, కేసముద్రం పీఎస్ నుంచి ఏఎస్సై కృష్ణమూర్తి, డీసీఆర్బీ మహబూబాబాద్ నుంచి ఏఎస్సై షేక్.యాకూబ్‌అలీ, డీఏఆర్ మహబూబాబాద్ నుంచి ఏఆర్ఎస్సై ఏ.సూరయ్య, నెల్లికుదురు పీఎస్ నుంచి ఏఎస్సై వెంకన్న, గార్ల పీఎస్ నుంచి ఏఎస్సై రవీందర్, సీసీఎస్ మహబూబాబాద్ నుంచి హెడ్‌కానిస్టేబుల్ శంకర్, మహబూబాబాద్ రూరల్ పీఎస్ నుంచి హెడ్‌కానిస్టేబుల్ దేవా, కేసముద్రం పీఎస్ నుంచి అతి ఉత్క్రిష్ట్ సేవ పతకానికి హెడ్‌కానిస్టేబుల్ రమేష్, గార్ల పీఎస్ నుంచి ఉత్క్రిష్ట్ సేవ పతకానికి కానిస్టేబుల్ మంగీలాల్ ఎంపికైనట్లు ఎస్పీ తెలిపారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో సేవా పతకాలు అందజేస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

సర్దార్ సర్వాయి పాపన్నకు నివాళి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్2 : జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పైండ్ల శ్రీనివాస్ నేతృత్వంలో పాపన్న చిత్రపటం వద్ద నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పోరాట వీరుడు సర్దార్ పాపన్నగౌడ్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేముల కొమ్మాల్‌రెడ్డి, రాజారాం, భార్గవచారి, ఉప్పలయ్యగౌడ్, యాదమ్మ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గౌడ సంఘం కమ్యూనిటీ హాల్లో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు ముంజాల ఆశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. బుడిగే భద్రసేన గౌడ్, సమ్మయ్య, జేరిపోతుల వెంకన్న, సమ్మెట వెంకన్న, లింగాల వీరభద్రం, మద్దెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

● తొర్రూరు : బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్, జడ్పీటీసీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారంతొర్రూరు డివిజన్ కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గౌడ సంఘాల నాయకులు పెద గాని సోమయ్య, కుమార్ గౌడ్, పెరుమాండ్ల రమేష్, చీకటి శ్రీనివాస్, రాము, శేఖర్, రమేష్, బిక్షం, యాదగిరి, వివిధ గౌడ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

● బయ్యారం : పాపన్న వర్ధంతి బయ్యారంలో జరిగింది. వర్ధంతిలో భాగంగా గౌడ కులస్థులు బస్టాండ్ సెంటర్ సమీప వారపు సంతలో గలపాపన్న విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. గౌడ కులస్థులు మండా రాజన్న, యర్సంగి వీరెంకులు, బస్వ శ్రీను, ఆకుల శ్రీను, కత్తి రమేష్ రాజా, బొలగాని పరదేశ్, కొత్త వినయ్, పొన్నం భాస్కర్, కారింగుల శ్రీను, గండు చిన వెంకన్న పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలని వినతి

నెల్లికుదురు, ఏప్రిల్ 2 : మునిగలవీడులో నీటి ఎద్దడిని నివారించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఇసెంపెల్లి సైదులు మాట్లాడుతూ వేసవిలో నీటికోసం గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రత్యేకాధికారి గ్రామ సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో బోర్లు ఏర్పాటు చేసి నీటిఎద్దడిని నివారించాలన్నారు. కార్యక్రమంలో ఎండీ యాకూబ్, కమలమ్మ, నీలమ్మ, రాములమ్మ, తుప్పతూరి వెంకన్న పాల్గొన్నారు

'వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి'

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 2 : వేసవిలో ఎండలు తీవ్రతరం అవుతున్నందున వడదెబ్బకు గురి కాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గుమ్మూనూర్ సబ్‌సెంటర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశాలతో మంగళవారం మెప్మా డీఎంసీ విజయ ఆధ్వర్యంలో ఆర్పీలతో సమావేశాన్ని నిర్వహించారు. వడగాల్పులు, వడదెబ్బ గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ వడదెబ్బకు గురి కాకుండా ప్రజలకు అర్థమయ్యేరీతిలో అవగాహన పర్చాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ టాబ్లెట్లు ఎండకాలంలో వాంతులు విరోచనాలను నివారించేందుకు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. ఆశవర్కర్లు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు ప్రజలను ఆరోగ్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ వారిని చైతన్య పర్చాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం, పీహెచ్‌సీలు, సబ్ సెంటర్‌లలో , ఆశల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు , జింక్ టాబ్లెట్లు అందుబాటులో ఉంటాయని వాటని ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కమిషనర్ నోముల రవీందర్, ఆరోగ్య విస్తరణాధికారి వొబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

వైద్యులను సంప్రదించాలి

● బయ్యారం : ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష్ సూచించారు. ఆషాడే కార్యక్రమంలో భాగంగా బయ్యారం పీహెచ్‌సీని సందర్శించి వేసవిలో తీసుకోవాల్సి జాగ్రత్తలు, వడదెబ్బ నివారణ చర్యలపై వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. వడదెబ్బకు సంబంధించి తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండిపోవటం, శరీరంలోని లవణాలు కోల్పోవడం, నాడి వేగంగా కొట్టుకోవటం, మూత్రవిసర్జనలో మంట లాంటి లక్షణాలుంటే వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మండు వేసవిలో ప్రయాణిస్తే టోపీ, రుమాల్, గొడుగు లాంటి వాటిని ధరించాలన్నారు. ఎక్కువగా వాటర్ తీసుకోవటంతో పాటు కొబ్బరి బోండం, నిమ్మరసం, పుచ్చకాయ, మజ్జిగ తదితర పండ్ల రసాలను తీసుకుంటే నీరసం నుండి ఉపశమనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాగర్, సీహెచ్‌వో క్రిష్ణ అర్జున్ రావు, చంద్, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్లు శాంతా, భారతితో పాటు వైద్య సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

● దంతాలపల్లి : వేసవిని దృష్టిలో పెట్టుకుని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మురలీధర్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన మందుల వివరాలు, ప్రసవాలు, సబ్ సెంటర్ పరిధిలో పల్లె దవఖానలో అమలవుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈకార్యక్రమంలో వైద్యురాలు చైతన్య, సీహెచ్‌వో బాలాజీ నాయక్, సిబ్బంది సత్తి, చలపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

దంతాలపల్లి, ఏప్రిల్ 2 : మండలంలోని గున్నేపల్లి, పెద్దముప్పారం, బొడ్లాడ, దాట్ల, ఆగపేట, వేములపల్లి, దంతాలపల్లి, బీరిశెట్టిగూడెంలో మంగళవార జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సీఈవో వెంకన్న తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రకం వరి ధాన్యానికి రూ.2203, సీ రకం ధాన్యానికి రూ. 2187 చెల్లిస్తామన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే దాన్యం విక్రయం జరపాలన్నారు. ఈకార్యక్రమంలో రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రైతులు మామిడి దిగుబడిపై ప్రత్యేక దృష్టి సారించాలి'

కురవి, ఏప్రిల్ 2 : మామిడి తోటల్లో కాత, పూత, దిగుబడి తగ్గకుండ రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని హర్టికల్చర్ అధికారిణి అనితశ్రీ సూచించారు. కురవి మండలంలోని పలు మామిడి తోటలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ... మామిడి తోటల్లో కత్తిరింపులు జూన్ 15 నుంచి ఆగస్టు 15 వరకు చేపట్టాలని సూచించారు. నేలబారు కొమ్మలు, అడ్డదిడ్డ కొమ్మలు, పీల కొమ్మలను నరికి వేయడం వల్ల సూర్యరశ్మి తగిలి కొత్త కొమ్మలు వస్తాయని సూచించారు. నూతన కొమ్మలు ముదిరిన పిమ్మట కాత, పూత పెరుగుతుందన్నారు. రైతులు ఎటువంటి సూచనలు కావాలన్న హర్టికల్చర్ అధికారులను సంప్రదించాలని కోరారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చేయూత



పిల్లలకు సహాయం అందజేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ బాధ్యులు

కేసముద్రం, ఏప్రిల్ 2 : కేసముద్రం విలేజి చైతన్యనగర్ కాలనీలో తల్లిదండ్రులను టెంట్ వేసుకొని జీవనం సాగిస్తున్న దేవేందర్, అమర్, అఖిలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ శాఖ తరుపున చేయూతనందించారు. తాత్కాలిక వసతి కోసం టార్పాలిన్, మూడు బొప్పున దుప్పటు, దోమతెరలు, పది రోజులకు సరిపోయే బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి జిల్లా చైర్మన్ టి. వరప్రసాద్, కోశాధికారి ఎం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రావుల రవిచందర్ రెడ్డి, గొర్రె వెంకన్న, సాయిక్రిష్ణ పాల్గొన్నారు.

కార్తీక్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నాం

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 2 : కొత్తగూడ మండలం రాంపురంలో వంకాయల కార్తీక్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్‌మాదిగ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓసీ క్లబ్‌లో మంగళవారం ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ కార్తీక్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మిడతపల్లి యాకయ్య, పాశం సాంబయ్య, ఎండి.పాషా, కందిపాటి బిక్షపతి, రేణుక, రజిత, సావిత్రి, వెంకన్న, సూరయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2: మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని శనిగపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పదవ తరగతి విద్యార్థులు బీరువా బహూకరించారు. స్థానిక పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం శ్రీదర్ మాట్లాడుతూ... 2023-24 విద్యాసంవత్సరం పదవ తరగతి వార్షిక పరీక్షలు రాసిన విద్యార్థులు వారి జ్ఞాపకంగా పాఠశాలకు బీరువా బహూకరించడం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయ బృందం ఎండీ రజాక్‌అలీ, వీరస్వామి, జోస్పిన్, కవిత, ప్రభాకర్, వెంకటరమణ పాల్గొన్నారు.

రంగోత్సవ్ ఆర్ట్ కాంపిటేషన్‌లో రాజోలు విద్యార్థుల ప్రతిభ

కురవి, ఏప్రిల్ 2 : రంగోత్సవ్ సెలబ్రేషన్ ఆర్గనైజేషన్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆర్ట్ కాంపిటేషన్‌లో రాజోలు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ముంబై సంస్థవారు జనవరి 2024లో నిర్వహించిన కలరింగ్, కార్టూన్‌మేకింగ్‌లో 6వ తరగతికి చెందిన డి.రాజేశ్వరి తృతీయ బహుమతి సాధించారు. పాఠశాలకు చెందిన బి.నవదీప్ బి.అఖిల ఆర్ట్‌మెరిట్‌లో పతకాలు సాధించారు. ఎం.లోకేష్‌నాయక్, బి.కీర్తన, జి.రేవంత్, తిరణ్‌తాజ్ మెడల్స్ సాధించారు. బి.చరణ్, యశ్వంత్‌లు కన్సోలేషన్ బహుమతులు పొందారు. బహుమతులు సాధించిన విద్యార్థులకు హెచ్ఎం రవికుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు వి.దామోదర్, బిక్కుచౌహాన్, వి.సురేష్, ఎల్.లింగమూర్తి, ఎస్.రవికుమార్, వి.రాజేశ్వరి, వీరభద్రం, సునీల్, ప్రభాకర్, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

ఉగ్గంపల్లిలో చలివేంద్రం ప్రారంభం

చిన్నగూడూరు, ఏప్రిల్ 2 : మండల పరిధిలోని ఉగ్గంపల్లిలో మంగళవారం జన వికాస ఆధ్వర్యంలో గ్రామపంచాయితీ కార్యాలయంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలవికాస ఉమ్మడి మరిపెడ మండల కోఆర్డినేటర్ గంధసిరి ఉపేంద్ర మాట్లాడారు. ఎంపీటీసీ ఉదయమ్మ కొమురెల్లి, మాజీ సర్పంచ్ పూలమ్మ, జూజ్జూరి ఉపేంద్ర, డొంకేని ఉపేంద్ర, గ్రామస్థులు ఉన్నారు.

బావి తవ్వుతుండగా కూలిన మట్టి

● మట్టిలో చిక్కుక్కున రైతు, కూలీ

● పోలీసులు, గ్రామస్థుల సహాయంతో క్షేమంగా బయటకు

కేసముద్రం, ఏప్రిల్ 2 : మండలంలోని కల్వల శివారు గాంధీపురం సమీపంలో మంగళవారం వ్యవసాయ బావి తవ్వుతుండగా మట్టికూలీ, ఇద్దరు చిక్కుక్కున్న సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపినప్రకారం. తాళ్లపూసపల్లి మాజీ సర్పంచ్ కొత్తం సుధాకర్ గాంధీపురం సమీపంలో వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. జేసీబీ యంత్రం సహాయంతో బావిని తవ్వుతుండగా బావి లోపలికి సుధాకర్‌తో పాటు పెద్ద మోరీ తండాకు చెందిన జాటోతు నరేష్ అనేవ్యక్తి దిగారు. బావిని తవ్వుతున్న క్రమంలో అకస్మాత్తుగా దరి కూలీపోయి ఇరువురిపై మట్టిపెళ్లలు పడటంతో ఇరువురు నడుములోతుకు కూరుకుపోయి చిక్కుక్కున్నారు. వెంటనే పక్కనే ఉన్న రైతులు, కూలీలు అక్కడికి చేరుకున్నారు. ఈవిషయం తెలుసుకున్న ఎస్సై వంశీధర్ తన బృందంతో బావి వద్దకు చేరుకొని ఎక్స్‌కలవేటర్ సహాయంతో ఇరువురిని వెలికి తీశారు. ఈ ఘటనలో ఇరువురికి గాయాలు కాగా 108 వాహనంలో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇరువురు వ్యక్తులు బావిలో చిక్కుక్కునారనే విషయం వ్యాప్తి చెందడంతో భారీసంఖ్యలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన జనం ఘటన స్థలానికి చేరుకున్నారు.



మట్టిలో కూరుకుపోయిన రైతు సుధాకర్, కూలీ నరేష్

ఉరి వేసుకొని పశువుల వ్యాపారి మృతి

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 2 : మండలంలోని గుర్తూర్‌లో ఉరి వేసుకొని పశువుల వ్యాపారి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన గుద్దేటి నర్సయ్య (43) గత కొన్ని సంవత్సరాలుగా గొర్రెలు, మేకల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో నష్టంరావడంతో అప్పులపాలైన అతడు మనసికంగా ఒత్తిడి గురవుతూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో మనస్థాపం చెందిన అతడు మంగళవారం గ్రామంలో ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు.

మానుకోటలో నగదు, బంగారం చోరీ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 2 : జిల్లా కేంద్రంలోని రామచంద్రాపురం కాలనీలోని ఓ ఇంటిలో చోరీ జరిగి నగదు, వెండి, బంగారు ఆభరణాలు అపహరించుకుపోయినట్లు బాధితుడు చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. కంబాలపల్లికి చెందిన చంద్రశేఖర్ రామచంద్రాపురం కాలనీలో నివాసముంటున్నాడు. ఎల్లమ్మ పండుగ ఉండడంతో మహబూబాబాద్‌లో ఉంటున్న ఇంటికి తాళంవేసి సోమవారం రాత్రి కంబాలపల్లికి వెళ్లారు. తిరిగి మంగళవారం సాయంత్రం వచ్చిచూసే సరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో హడావుడికి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.33 వేల నగదు, 10 తులాల వెండి, అరతులం బంగారుఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు చెప్పారు. ఈ విషయంపై మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు చంద్రశేఖర్ తెలిపారు.

క్రేన్ వైర్‌తెగి.. డబ్బా మీదపడి ఒకరి మృతి

నర్సింహులపేట, ఏప్రిల్ 2 : మండలంలోని నర్సింహాపురం బంజర జీపీ పరిధిలోని పత్తితండాలో ప్రమాదవశాత్తు క్రేన్ వైర్ తెగి మట్టిని తోడే డబ్బా మీదపడి ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. నర్సింహాపురం బంజరకు చెందిన బయ్య వెంకన్నకు చెందిన వ్యవసాయ బావిలో పూడిక తీసేందుకు కొందరు కూలీలు బావిలోకి దిగారు. బావిపై నుంచి క్రేన్ ద్వారా బావిలోని మట్టిని తీస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ప్రమాదవశాత్తు క్రేన్‌వైరు తెగి మట్టితో నిండి ఉన్న డబ్బా బావిలో పడిపోయింది. ఈ ఘటనలో బావిలో పూడిక మట్టిని ఎత్తుతున్న రవిపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో రవి మృతి చెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య సుమిత్ర, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రవి (ఫైల్)

రోడ్డుపై మందుబాబుల వీరంగం

మరిపెడ, ఏప్రిల్ 2 : మరిపెడ బంగ్లాలోని హైవే రోడ్డుపై మందుబాబులు తాగిన మైకంలో మంగళవారం వీరంగం సృష్టించారు. పీఎస్ రైటర్ ఉమాకర్ తెలిపిన వివరాల ప్రకారం. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కోక్యతండాకు చెందిన బానోత్ నగేశ్ (డేవిడ్), సూర్యాపేట జిల్లా మోతె మండలం గోపాతండాకు చెదిన మూడ్ రాము పేయింటింగ్ పనుల కోసం మరిపెడ మండలం తండా ధర్మారానికి వచ్చారు. మంగళవారం వీరిద్దరు స్థానికంగా ఉన్న ఓవైన్స్‌షాపులో తాగిరోడ్డుపై వీరంగం చేశారు. దీంతో నేషనల్ హైవేపై వాహనాలు ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయి. ఈ విషయం పోలీసులకుతెలిసి,మందుబాబులను అదుపులోకి తీసుకొన్నారు. పలు న్యూసెన్స్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



రోడ్డుపై తాగిన మైకంలో వీరంగం చేస్తున్న మందుబాబులు

'ప్రత్యేక పరిస్థితులు కలిగిన ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 :లోక్‌సభ ఎన్నికల విధుల నుంచి ప్రత్యేక పరిస్థితులు కలిగిన ఉపాధ్యాయులను మినహాయించాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ-టీఎస్) జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బద్రినారాయణ మాట్లాడుతూ మే నెలలో జ.రగబోయే పార్లమెంట్ ఎన్నికల విధుల్లో గర్భిణీ ఉపాధ్యాయినీలు, బాలింతలు, అంగవైకల్యం, చూపు లోపించిన, ఆరునెలల లోపు ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, దీర్ఘకాలిక రోగులు క్యాన్సర్, న్యూరో, మానసిక వికలాంగులు, గుండెసంబంధిత వ్యాధులతో బాధపడుతూ ఉపాధ్యాయులను మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కల్లెం వెంకట్‌రెడ్డి, హాల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● షీ టీం ఎస్సై సునంద

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 : అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీటీం ఎస్సై సునంద అన్నారు. మహబూబాబాద్ సాంఘిక సంక్షేమ మహిళా ఫార్మసీ కళాశాలలో మంగళవారం ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ చెన్నయ్య నేతృత్వంలో పాఠశాలలో విద్యార్థినులకు మానవ అక్రమ రవాణా, ఉమెన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ క్యూఆర్ కోడ్ పిటీషన్, సైబర్ నేరాలు అండ్ సైబర్ సెక్యూరిటీ సేవలు, 1930, ఫోక్సో చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అపరిచితుల నుంచి ఫోన్‌కాల్స్ వచ్చినా, మెసేజ్‌లు వచ్చినా, వేధించటం మొదలగు చర్యలకు పాల్పడినా వెంటనే షీటీం వాట్సాప్ నెంబర్ : 87126 56935, 79011 42009లను సంప్రదించాలన్నారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు, షీటీం సిబ్బంది రమేష్, అరుణ, పార్వతి, ఊర్మిళ పాల్గొన్నారు.